క్లుప్తంగా

పోస్టుల భర్తీకి డిమాండ్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతిని కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా డిమాండ్ చేశారు. సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. పరిశ్రమల్లో స్థానికులకు 70 శాతం ఉద్యోగావకాశాలను కల్పించాలని కోరారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విజయవాడలో ఈ నెల 17న నిర్వహించనున్న నిరుద్యోగుల ఆవేదన సదస్సుకు భారీగా తరలిరావాలని కోరారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ నగరాధ్యక్షుడు గౌస్‌బాషా, నేతలు శిరీషా, రేవంత్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా లార్వా సర్వే



నెల్లూరు(అర్బన్): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కీటక జనిత వ్యాధుల నివారణకు సంబంధించిన లార్వా సర్వేను విస్తృతంగా చేపట్టాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. యాకోబ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఆకుతోటలో వైద్యశాఖ సిబ్బంది నిర్వహిస్తున్న లార్వా, ఫీవర్ సర్వేలను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఆశ కార్యకర్తలు వారికి కేటాయించిన ఇళ్లలో లార్వా, ఫీవర్ సర్వే చేసి వివరాలను నమోదు చేసి రికార్డులను అందజేయాలని కోరారు. ఫ్రైడే.. డ్రైడేలో భాగంగా వారానికో రోజు నీటి తొట్లను శుభ్రం చేసి ఎండబెట్టేలా ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. ఎంపీహెచ్ఏ మస్తాన్, ఏఎన్ఎం నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ ఎస్సీ నేతలకు సత్కారం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సర్వసభ్య సమావేశంలో భాగంగా పార్టీ ఎస్సీ నేతలను శుక్రవారం సత్కరించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకరావు మాదిగ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళి, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట ఇన్‌చార్జి కిలివేటి సంజీవయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి స్వర్ణ వెంకయ్య, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



నెల్లూరు రూరల్: నగరంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకాన్ని బీజేపీ నేతలు శుక్రవారం నిర్వహించారు. జీఎస్టీలో స్లాబులను తొలగించడంపై ఆనందం వ్యక్తం చేశారు. నేతలు కందికట్ల రాజేశ్వరమ్మ, పొట్లూరి శ్రీనివాసులు, మిడతల రమేష్, పద్మావతి, చిట్టిబాబు, శ్రీనివాసులు, కృష్ణ, ప్రభాకర్, ముజీబ్, కాసా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

27న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు(పొగతోట): నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఏడు స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 27న నిర్వహించనున్నామని సీఈఓ మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్న సమావేశానికి స్థాయీ సంఘాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

సేవల్లో అట్టడుగు స్థానంలో జిల్లా



మాట్లాడుతున్న సంతోషరావు

- పనితీరు మెరుగుపర్చుకోకపోతే చర్యలు
- ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వినియోగదారులకు మంచి సేవలను అందించడంలో జిల్లా విద్యుత్ శాఖ చివరి స్థానంలో ఉందని, పనితీరును మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు స్పష్టం చేశారు. మాగుంట లేఅవుట్లోని ఓ కల్యాణ మండపంలో నెల్లూరు టౌన్, రూరల్, కోవూరు డివిజన్ విద్యుత్ అధికారులు, సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులకు సేవలందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేలో ఎస్పీడీసీఎల్ పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో నెల్లూరు జిల్లా అట్టడుగు స్థానంలో ఉందన్నారు.



హాజరైన అధికారులు, సిబ్బంది

లో ఓల్టేజీ, సింగిల్ ఫేజ్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్‌ను తగ్గించడం తదితరాల్లో అలసత్వం వహిస్తున్నారని మండిపడ్డారు. అధికారులు, సిబ్బంది తాము విధులు నిర్వర్తిస్తున్న హెడ్ క్వార్టర్స్‌లో నివాసం ఉండటంలేదని, ఇదే చివరి అవకాశమని.. అప్పటికీ పట్టించుకోకపోతే వారిని గుర్తించి హెచ్ఆర్ఏ, డీఏను కట్ చేస్తామని హెచ్చరించారు. నిర్దేశించిన సమయానికి రావడంతో పాటు వినియోగదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని కోరారు. నిరంతర విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని చెప్తున్నారే తప్ప ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. జేఎల్ఎం గ్రేడ్ – 2 ఉద్యోగులు కష్టపడి పనిచేస్తున్నారని కితాబిచ్చారు. జిల్లాలో వ్యవసాయ సర్వీసులను మంజూరు చేసే విషయంలో కొంతమంది అధికారులు, సిబ్బంది జాప్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ విధంగా వ్యవహరించిన ఓ అధికారిని సస్పెండ్ చేశామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు రిపేర్‌కు గురైన సమయాల్లో నూతన వాటిని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో రైతులు, వినియోగదారుల సాయం కోరవద్దన్నారు. ఆర్డీఏ స్పెస్ స్కీమ్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు త్రీఫేజ్ విద్యుత్‌ను అందించేందుకు రూ.400 కోట్లతో పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. వీధి దీపాలు పగటి పూట వెలగకుండా వాటికి ఏబీ స్విచ్‌లు, మీటర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల జీరో మెయింటెనెన్స్ చేసే సిబ్బందికి నగదు రివార్డులను ప్రకటించి ఏటా ఆగస్టు 15న అందజేస్తామని ప్రకటించారు. పీఎం సూర్యఘర్‌పై అవగాహన కల్పించాలని కోరారు. ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య, ఎస్ఈ విజయన్, నెల్లూరు టౌన్, రూరల్, కోవూరు ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, రమేష్‌చౌదరి, పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇక్కట్లు తలెత్తకూడదు



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ రెండు వరకు నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు రాజరాజేశ్వరి ఆలయంలోని కల్యాణ మండపంలో ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులను సత్కరించారు. ఆర్డీఓ అనూష, డీఎస్పీ సింధుప్రియ, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రాజరాజేశ్వరి అమ్మవారి సేవా సమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధించేలా కృషి



మాట్లాడుతున్న మాధురి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వర్తించి, 2029 నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించేలా కృషి చేయాలని కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ మాధురి సూచించారు. ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక బృందాలకు శిక్షణ తరగతులను నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించారు. ట్రెయినర్లు నారాయణరెడ్డి, శ్రీకాంత్ అవగాహన కల్పించారు. అడల్ట్ ఎడ్యుకేషన్ నోడల్ ఆఫీసర్ మస్తాన్‌రెడ్డి, అర్బన్ ఎంఈఓ తిరుపాల్, మెప్మా ఏఓ సుధాకర్, సూపర్‌వైజర్లు రాజశేఖర్, కృష్ణకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలంటూ ధర్నా





కలెక్టరేట్ వద్ద ఏఐడీఎస్ఓ, పీడీఎస్‌యూ నేతల ధర్నా

నెల్లూరు(అర్బన్): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏఐడీఎస్ఓ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద సంఘ నేతలు, విద్యార్థులు ధర్నాను శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కార్యదర్శి మహేష్ మాట్లాడారు. నూతన విద్యావిధానం పేరిట అసంబద్ధ నిర్ణయాలను ప్రభుత్వం తీసుకుంటూ విద్యార్థులకు తీరని నష్టాన్ని కలిగిస్తోందని ఆరోపించారు. వృత్తి విద్యనభ్యసించిన వారికే ఇంటర్న్‌షిప్ ఉపయోగపడుతోందని, సాధారణ డిగ్రీ వారికి ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు తెచ్చి కళాశాలలకు ఫీజులు చెల్లిస్తున్నారని చెప్పారు. ఐటీఐల్లో మౌలిక వసతులను కల్పించాలని, నగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, మహిళా విద్యార్థులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్లో అధికారులకు వినతిపత్రమిచ్చారు. ఏఐడీఎస్ఓ నగరాధ్యక్ష, కార్యదర్శులు త్రినాథ్, ప్రియ, వరుణ్, సందీప్, మస్తాన్, సాదిఖ్ తదితరులు పాల్గొన్నారు.

- యువగళంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మంత్రి నారా లోకేశ్ విఫలమయ్యారని పీడీఎస్‌యూ నేతలు ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలంటూ ట్రంక్‌రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ మాట్లాడారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించి పేదలకు వైద్య విద్య అందకుండా చేసే కుట్రలను మానుకోవాలని, లేని పక్షంలో ప్రభుత్వానికి విద్యార్థులు తగిన గుణపాఠం చెప్తారన్నారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్, షారూఖ్, ఆశిర్, ప్రసాద్, మస్తాన్, చరణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని విశ్వభారతి స్కూల్లో ఉపాధ్యాయులు అబ్దుల్ మాజిద్, మంజులను శుక్రవారం సత్కరించారు. బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, శింగంశెట్టి మురళీమోహన్, జయప్రకాష్, కరస్పాండెంట్ షకీలా పాల్గొన్నారు.


మహాకుంభాభిషేకం



ఆలయ శిఖరంపై పవిత్ర జలంతో ప్రోక్షణ

నెల్లూరు(బృందావనం): ట్రంక్ రోడ్డు సమీపంలోని వరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన వార్షిక కుంభాభిషేకాన్ని శివాజీ సెంటర్ మిత్రమండలి ఆధ్వర్యంలో వేడుకగా శుక్రవారం నిర్వహించారు. గణనాథుడికి విశేష పూజలను అర్చకుడు వైద్యుల సతీష్‌శర్మ ఆధ్వర్యంలో జరిపారు. అనంతరం ఆలయ శిఖరంపై ప్రోక్షణను నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. సుబ్రహ్మణ్యం, రంగరాజన్, శ్రీహరి, పేటేటి భాస్కర్‌రావు, ,బాలసుబ్రహ్మణ్యం, మధుసూదన్ తదితరులు పర్యవేక్షించారు.

చిన్నపిల్లల వైద్య శిబిరం



నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణలో గల బాల భవిత కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన చిన్న పిల్లల ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చెన్నైలోని రెయిన్‌బో వైద్యశాలకు చెందిన చిన్నపిల్లల గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ స్పెషలిస్ట్ సోమశేఖర్ పరీక్షించారు. ఈ సందర్భంగా బాల భవిత కేంద్రంలోని చిన్న పిల్లల డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడారు. గ్యాస్ట్రో సమస్యలతో బాధపడుతున్న పేద చిన్నపిల్లల కోసం ఇక్కడ ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఎవరికైనా లివర్ మార్పిడి చేయాల్సి వస్తే పీఎం కేర్ లేదా ట్రస్ట్ సాయం ద్వారా ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా చేయనున్నారని చెప్పారు.

సర్పంచ్, ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

నెల్లూరు(పొగతోట): వెంకటాచలం పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై సర్పంచ్ రాజేశ్వరితో పాటు సహకరించిన ఉద్యోగులకు షోకాజ్ నోటీసులను పంపనున్నామని, వారిచ్చే వివరణ ఆధారంగా చర్యలు చేపడతామని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనను శుక్రవారం విడుదల చేశారు.

ఘన నివాళి



నెల్లూరు సిటీ: ములుమూడికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత కరీమ్ సాహెబ్ మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన భౌతికకాయానికి పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి శుక్రవారం నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీవీఈఓను కలిసిన స్కూల్ గేమ్స్ సెక్రటరీ



నెల్లూరు (టౌన్): నగరంలోని కేఏసీ జూనియర్ కళాశాలలో డీవీఈఓ కృష్ణారెడ్డిని స్కూల్ గేమ్స్ సెక్రటరీగా నియమితులైన జూనియర్ లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పాటూరు వేణుగోపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డికి అభినందనలను తెలిపారు.

అర్బన్ కాంక్లేవ్‌కు కమిషనర్



నెల్లూరు(బారకాసు): కేరళలోని కొచ్చిలో అక్కడి ప్రభుత్వం నిర్వహిస్తున్న అర్బన్ కాంక్లేవ్‌కు కమిషనర్ నందన్ శుక్రవారం హాజరయ్యారు. ఆకాంక్షించే నగరాలు.. అభివృద్ధి చెందే సమాజాలు అనే థీమ్‌తో నిర్వహించిన సమావేశాన్ని కేరళ సీఎం పినరాయి విజయన్ ప్రారంభించారు.

హౌసింగ్ నిర్మాణాలపై విజిలెన్స్ విచారణ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో పేదలకు సంబంధించిన పక్కా గృహాల నిర్మాణాల్లో స్టీల్, సిమెంట్ దుర్వినియోగం.. నాసిరక నిర్మాణాలపై విజిలెన్స్ విచారణను నగరంలోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ వెంకటరమణకు వినతిపత్రాన్ని బీజేపీ నేతలు మిడతల రమేష్, పొట్లూరి శ్రీనివాసులు తదితరులు అందజేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలు, ఇక్కడి అధికారుల వివరాలను ప్రభుత్వానికి నివేదికగా పంపుతానని ఆయన తెలిపారు.

యూనియన్ బ్యాంక్‌లో సెల్లింగ్ ఏజెంట్లుగా అవకాశం

నెల్లూరు(అర్బన్): గృహ రుణాలకు సంబంధించి కస్టమర్లను సిఫార్సు చేసి కమీషన్‌తో మంచి ఆదాయాన్ని పొందేందుకు గానూ డైరెక్ట్ సెల్లింగ్ ఏజెంట్లుగా అర్హులను నియమిస్తున్నామని మాగుంట లేఅవుట్లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిష్టాత్మక బిల్డర్లు, వారి సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు, పదో తరగతి పాసైన వారు, ప్రభుత్వ రంగ బ్యాంకుల మాజీ ఉద్యోగులు, ఆర్థిక సేవల రంగంలో ఉన్న వ్యక్తులు, ఫర్మ్ కంపెనీలు తదితరులకు అత్యుత్తమ ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను మాగుంట లేఅవుట్లోని తమ కార్యాలయ రెండో ఫ్లోర్‌లో సమర్పించాలని కోరారు. వివరాలకు 81432 24386, 99661 11489 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా హిందీ దివస్



డీకేడబ్ల్యూలో..



నవాబుపేటలోని మున్సిపల్ పాఠశాలలో..

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో హిందీ దివస్‌ను శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఒడిశా సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీకాంత్ లక్ష్మణ్‌రావు మాట్లాడారు. దేశ ప్రజలను ఏకతాటిపై నడిపించడంలో హిందీ భాష కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. అనంతరం మీమ్ క్రియేషన్స్, ఎమోజీ ఆధారిత కథల రచన తదితర పోటీలను నిర్వహించారు. విద్యార్థి భానుశ్రీ రూపొందించిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ యాంకర్ కార్యక్రమం ఆకట్టుకుంది. ప్రిన్సిపల్ గిరి తదితరులు పాల్గొన్నారు.

- నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో హిందీ దివస్‌ను మేరా యువ భారత్, స్వయం కృషి రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, కవితా పఠనం తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. మేరా భారత్ జిల్లా యువజనాధికారి మహేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ రమణారెడ్డి, సెట్నెల్ సీఈఓ నాగేశ్వరరావు, హిందీ అధ్యాపకుడు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ: నవాబుపేటలోని మున్సిపల్ పాఠశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు బాలబ్రహ్మాచారి, అచ్చయ్య, కమల, తిరుపాల్‌రాజు, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సీతారామ్ ఏచూరికి నివాళులు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీపీఎం మాజీ కార్యదర్శి, దివంగత సీతారామ్ ఏచూరి పోరాట యోధుడని పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ కొనియాడారు. నగరంలోని 16వ డివిజన్లో గల పార్టీ కార్యాలయంలో సీతారామ్ ఏచూరి ప్రథమ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీనివాసులు, సుధాకర్, సంపూర్ణమ్మ, వెంకటేశ్వర్లు, బాబు, కుమార్, డీవైఎఫ్ఐ నగర కమిటీ సభ్యులు వెంకటేష్, రాజేష్, శశి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలోని జనార్దన్‌రెడ్డి కాలనీ, టిడ్కో గృహ సముదాయం తదితర ప్రాంతాలు.. శెట్టిగుంట రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని మూడో మైలు, ప్రశాంతినగర్, వెంగళరెడ్డినగర్, రాజీవ్‌గాంధీ కాలనీ, ఇండస్ట్రియల్ ప్రాంతం, డీఎస్సార్‌నగర్, కిసాన్‌నగర్, బంగ్లాతోట, యనమలవారిపాళెం, సింహపురి కాలనీ, వేణుగోపాల్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని వివరించారు.

- రైతుబజార్ సబ్‌స్టేషన్ పరిధిలోని తడికలబజార్, స్టోన్‌హౌస్‌పేట మెయిన్ రోడ్డు, ఎన్టీఎన్ లేఅవుట్, అరుంధతీయవాడ, విజయగోపాలపురం తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు వరకు.. రామ్మూర్తినగర్, యనమలవారిదిన్నె సబ్‌స్టేషన్ల పరిధిలోని రామ్మూర్తినగర్, వెంకట్రామాపురం, జేమ్స్‌గార్డెన్, మినీబైపాస్ రోడ్డు, బాలాజీనగర్, ఆదిత్యనగర్, యనమలవారిదిన్నె, పద్మావతి గ్రీన్ సిటీ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.
- గోమతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గోమతినగర్, సర్వేపల్లి కాలువకట్ట, హరనాథపురం ఎక్స్‌టెన్షన్ ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 వరకు.. ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని సుజాతమ్మ కాలనీ, బషీర్‌కాలనీ, జేవీఆర్ కాలనీ, రామాలయం వీధి, లక్ష్మీనరసింహపురం, ఎల్ఐసీ కార్యాలయం, టీటీడీ కల్యాణ మండపం, కొండాయపాళెం గేట్, డీఈఓ కార్యాలయం, కేవీఆర్ పెట్రోల్ బంక్, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.
- పడారుపల్లి, కొండాయపాళెం సబ్‌స్టేషన్ల పరిధిలోని పడారుపల్లి, ఆర్టీఏ కార్యాలయ రోడ్డు, సప్తగిరి కాలనీ, సుందరయ్య కాలనీ, ఎన్జీఓ కాలనీ, ఉమ్మారెడ్డిగుంట, సంఘమిత్ర కాలనీ, నక్కలగుంట, కొండాయపాళెం తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 వరకు.. వైఎంసీఏ సబ్‌స్టేషన్ పరిధిలోని వీఆర్సీ సెంటర్, కలెక్టరేట్, రెడ్‌క్రాస్, వహాబ్‌పేట, చాకలివీధి, ఏసీ కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని తెలిపారు.
- రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మనుమసిద్ధినగర్, పుత్తా ఎస్టేట్స్, గుప్తా పార్కు, ఈద్గామిట్ట, పొర్లుకట్ట తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. రంగనాథ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇసుకడొంక, రంగనాయకులపేట, కపాడిపాళెం, సంతపేట, రైల్వేఫీడర్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదన్నారు.
- డీఆర్డీఏ సబ్‌స్టేషన్ పరిధిలోని కాపు వీధి, జొన్నలగడ్డవారివీధి, కాకర్లవారివీధి, ట్రంక్‌రోడ్డు, సుబేదారుపేట, నర్తకి సెంటర్, ఆనంవారివీధి తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కలెక్టర్ సహకారం మరువలేనిది



ఆనంద్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): కలెక్టర్‌గా ఆనంద్ 14 నెలల కాలంలో రెవెన్యూతో పాటు ఇతర శాఖలకు అందించిన సహకారం మరువలేనిదని ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్‌ను ప్రభుత్వం బదిలీ చేసిన నేపథ్యంలో జిల్లాలోని పలువురు తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు శుక్రవారం ఆయన్ను నెల్లూరులో కలిసి స్వీట్లు, పూల బొకేలను అందజేశారు. అనంతరం సన్మానించారు. ఏపీఆర్ఎస్ఏ జిల్లా కార్యదర్శి యెడ్ల నాగేశ్వరరావు, నేతలు డేనియల్ పీటర్‌రావు, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక చికిత్సపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వెంకటతరుణ్

నెల్లూరు(అర్బన్): ప్రాథమిక చికిత్సపై అవగాహనను తప్పక పెంచుకోవాలని జనరల్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ మాదాల వెంకటతరుణ్ పేర్కొన్నారు. ప్రపంచ ఫస్ట్ ఎయిడ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుజబుజనెల్లూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సును సెట్నెల్, పీఎంపీ, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సెట్నెల్ సీఈఓ నాగేశ్వరరావు, కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి, నెహ్రూ యువ కేంద్ర అధికారి మహేంద్రరెడ్డి, హెచ్ఎం వెంకటరమణ, రమణయ్య, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తులను ఒంటేరు పోలయ్య గారి కుమారుడు ఒంటేరు వేణుగోపాలరావు గారు రిజిష్టరు విక్రయ పత్రము నెంబరు 1151/1996 తేది 29.02.1996 ద్వారా మస్తాన్ చిన్నయ్య గారి కుమారుడు మస్తాన్ శ్యామ్ కుమార్ గారికిని విక్రయించినారు. తదుపరి సదరు శ్యామ్ కుమార్ గారు సదరు ఆస్తులను రిజిష్టరు విక్రయ పత్రము నెం. 1477/2008 తే 10.04.2008 మరియు 15439/2004 తే 06.10.2004 దిల ద్వారా సయ్యద్ సలీమ్ గారి భార్య సయ్యద్ మసూద గారికి విక్రయించినారు. సదరు విక్రయ పత్రములలో ఒరిజినల్ విక్రయ పత్రము నెంబరు 1151/1996 తేది 29.02.1996 పోయినదని చెప్పి ఉన్నారు. తదుపరి సదరు ఆస్తులను సదరు మసూద గారు కోట వెంచయ్య గారి కుమారుడు నాగార్జున గారికి రిజిష్టరు విక్రయ పత్రము నెంబర్లు 5639/2008 తేది 10.10.2008, 14197/2005 తేది 27-10-2005 ద్వారా అమ్మినారు. సదరు నాగార్జున గారు తనకు ఈ క్రింది ఆస్తులకు తనకు పూర్తి హక్కులు కలవని చెప్పుచూ ఈ క్రింది తెలుపబడిన నా కక్షిదారునికి విక్రయించుచున్నారు. సదరు నాగార్జున గారికి గల పూర్తి హక్కుల గురించి ఎవరికైనా ఎలాంటి అభ్యంతరములు ఉన్నయెడల నా కక్షిదారుని '7' రోజులలో తెలుపుకొనవలెనని. లేనిచో ఎలాంటి ఆక్షేపణలు లేవని భావించి నా కక్షిదారుడుకి ఈ క్రింది ఆస్తులను కొనుగోలు చేయుగలరు.

ఆస్థి షెడ్యూలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, స్టోన్ హౌస్‌పేట సబ్ రిజిస్ట్రేషన్ నెల్లూరు. మునిసిపల్ కార్పొరేషన్ లిమిట్స్, వావిలేటిపాడు ఏరియా, సర్వే నెం.17/1, ఎల్.పి.నెం.60/94, నిర్మల శాటిలైట్ టౌన్షిప్ ప్లాటు నెంబర్లు 67, 68, 66 2/3 అంకణములు స్థలమునకు హద్దులు: తూర్పు : ప్లాటు నెంబర్లు 79, 80. దక్షిణం : ప్లాటు నెం. 69. పడమర : రోడ్డు, ఉత్తరము : రోడ్డు.

నా కక్షిదారుడు అడ్రసు
షేక్ రియాజ్ S/o. బషీర్
డోర్ నెం. 16-11-69/1, హరనాథపురం
4వ వీధి, పినాకిని నగర్, నెల్లూరు.
సెల్ : 8074700500

ఇట్లు
కొండూరు శేషారెడ్డి
బి.కామ్. బి.ఎల్.,
అడ్వకేటు, బాలాజీనగర్, నెల్లూరు.
సెల్: 9440277290